సాక్షి నిజామాబాద్


ఆదివారం । 31 । ఆగస్టు । 2025



సేవలు భేష్

వరద ప్రభావానికి లోనైన ప్రాంతాల్లో ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు అందించిన సేవలను కలెక్టర్ అభినందించారు.

- 8లో ▸



మళ్లీ పోటెత్తిన వరద

ఎస్సారెస్పీకి శనివారం రాత్రి మళ్లీ వరద నీరు పోటెత్తింది. ఎగువ ప్రాంతాల నుంచి 5.40 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.1 /22.3

ఉదయం చల్లటి గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

సీసీల బదిలీలు పూర్తి

- ఉత్తర్వులు అందజేసిన అధికారులు



డొంకేశ్వర్(ఆర్మూర్): గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో క్లస్టర్ కోఆర్డినేటర్లకు (సీసీలు) బదిలీలు పూర్తయ్యాయి. కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లో బదిలీలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సీనియార్టీ ప్రకారం మొత్తం 145 మందికి కోరుకున్న మండలాలు, క్లస్టర్లకు బదిలీలు చేశారు. పదేళ్ల తర్వాత ఐకేపీలో ఉద్యోగ బదిలీలు జరగడంతో సంతోషం వ్యక్తంచేశారు. ఐతే, వెనువెంటనే బదిలీ ఉత్తర్వులను అందజేసిన అధికారులు, కొత్త క్లస్టర్లలో సోమవారం రిపోర్ట్ చేయాలని సీసీలకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొత్త ప్రాంతాలకు వెళ్లే ఉద్యోగులు అంకిత భావం, కొత్త ఉత్సాహంతో పని చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన రుణాలు, లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీవో సాయాగౌడ్, ఏపీడీ మధుసూదన్ పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవానికి కట్టుదిట్టమైన భద్రత

- ఉమ్మెడ బ్రిడ్జిని పరిశీలించిన సీపీ సాయిచైతన్య



నందిపేట్(ఆర్మూర్): వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు. నందిపేట మండలంలోని ఉమ్మెడ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన గణేశ్ నిమజ్జన స్థలాన్ని శనివారం ఆయన పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల రాకపోకలు, క్రేన్లు నిలిపి ఉంచే స్థలం, లైటింగ్, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేసే ప్రాంతాలను పరిశీలించారు. నందిపేట ఎస్సై శ్యామ్‌రాజ్‌కు పలు సూచనలు చేశారు. వినాయక శోభాయాత్రలో డీజేలకు అనుమతించొద్దన్నారు. ప్రజలు సైతం పోలీసులకు సహకరించి గణేశ్ నిమజ్జనాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని సీపీ కోరారు.

వర్షాలు తగ్గుముఖం

- జిల్లాలో 3.9 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు



సాలూర: మందర్నా నుంచి తిరిగి వెళ్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం

సుభాష్‌నగర్: జిల్లాలో వర్షాలు తగ్గుముఖం పట్టాయి. శనివారం 3.9 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా నందిపేట్‌లో 24.2 మిల్లీమీటర్లు, డొంకేశ్వర్‌లో 13.5, బాల్కొండలో 12.7, వర్నిలో 9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్టులు, చెరువులు, రిజర్వాయర్లు, కుంటలకు వరద ప్రవాహం తగ్గింది. అన్ని శాఖల అధికారులు వరద నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించే పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రాథమిక నష్టాన్ని ఇప్పటికే కలెక్టర్ నివేదించినప్పటికీ.. పూర్తిస్థాయి నష్టాన్ని అంచనా వేస్తున్నారు. జిల్లాలో ఈ సీజన్‌కుగాను 10 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కాగా, 19 మండలాల్లో సాధారణ, నాలుగు మండలాల్లో ఇంకా లోటు వర్షపాతం నమోదైందని అధికారులు పేర్కొంటున్నారు.

ఇంజనీరింగ్ స్పాట్ అడ్మిషన్స్ పొడిగింపు

తెయూ(డిచ్‌పల్లి): భారీ వర్షాల నేపథ్యంలో తెలంగాణ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లను సెప్టెంబర్ 1, 2వ తేదీల్లో కొనసాగించాలని ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26, 28, 29వ తేదీల్లో జరిగిన స్పాట్ అడ్మిషన్స్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో ఆరుగురు, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (ఏఐ)లో నలుగురు విద్యార్థులు అడ్మిషన్స్ పొందినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు సీఎస్ఈలో 57 మంది, సీఎస్ఈ(ఏఐ)లో 12 మంది అడ్మిషన్లు తీసుకున్నట్లు తెలిపారు.





వేల్పూర్ మోతె చెక్‌డ్యాం కట్ట తెగడంతో రైతు బద్దం సుదర్శన్‌కు చెందిన ఎకరం పంటలో చేరిన ఇసుక మేటలు



సాలూర మండలంలోని ఖాజాపూర్ గ్రామ శివారులో మంజీర వరద నీటితో చెరువును తలపిస్తున్న పంటను చూపిస్తున్న రైతులు



సాలూర మండలం హున్సా గ్రామ శివారులో నీట మునిగిన సోయా పంటను చూపిస్తున్న రైతు సాయిలు

పొలం.. కన్నీటి జలం

నీటిలోనే మంజీర తీర ప్రాంత పంటలు | 48,429 ఎకరాల్లో పంటలు నష్టం

- 1,026 ఎకరాల్లో ఇసుక మేటలు
- మంజీర పరీవాహకంలో తగ్గిన ఉధృతి..కొనసాగుతున్న ప్రవాహం
- బురద తొలగిస్తున్న వరద బాధితులు
- పలుచోట్ల మొదలైన రాకపోకలు
- పునరావాస కేంద్రాల నుంచి ఇళ్లకు..
- ఎస్సారెస్పీకి ఇన్‌ఫ్లో 5,40,000 క్యూసెక్కులు.. అవుట్‌ఫ్లో 4,50,000 క్యూసెక్కులు

భారీ వర్షాలు, వరదలు జిల్లాలోని గోదావరి, మంజీర నదుల తీర ప్రాంత రైతులను నట్టేట ముంచాయి. నది పరీవాహక ప్రాంతాల్లోని పొలాలు రెండు రోజులుగా వరద నీటిలోనే ఉండడంతో తీవ్రనష్టం వాటిల్లింది. పలుచోట్ల ఇసుక మేటలతో పంటలు దెబ్బతిన్నాయి. నిజామాబాద్ రూరల్, బోధన్ నియోజకవర్గాల్లో జలదిగ్బంధంలోని గ్రామాల నుంచి వరద నీరు వెళ్లిపోయింది. దీంతో రాకపోకలు మొదలయ్యాయి. పునరావాస కేంద్రాల నుంచి జనం తిరిగి ఇళ్లకు చేరుకున్నారు.



సాలూర మండలం హున్సా గ్రామ శివారులో నీట మునిగిన సోయా పంటను చూపిస్తున్న రైతు భీంరావు కుటుంబీకులు



సిరికొండ మండలం కొండూర్‌లో తడిసిన బియ్యం సంచులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జిల్లాలోని సిరికొండ, ధర్పల్లి మండలాల్లో కురిసిన భారీ వర్షం, బోధన్ డివిజన్‌లో ఉధృతంగా ప్రవహించిన మంజీర నది, శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్ బోధన్, సాలూరా, రెంజల్ మండలాల్లోని పలు గ్రామాలను నీట ముంచాయి. జిల్లా వ్యాప్తంగా అధికారిక లెక్కల ప్రకారం 48,429 ఎకరాల్లో పంటలు దెబ్బతిని అన్నదాతలు నష్టపోయారు. ఇందులో 1,026 ఎకరాల పంట భూముల్లో ఇసుక మేటలు వేశాయి. శ్రీరాంసాగర్ జలాశయంలోకి ప్రస్తుతం 5,40,000 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా, 38 గేట్ల ద్వారా 4,50,000 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

■ బోధన్ రెవెన్యూ డివిజన్‌లో మంజీర నది ఉధృతి తగ్గినప్పటికీ నీటి ప్రవాహం కొనసాగుతూనే ఉంది. మంజీర ఉధృతికి రెండు రోజులపాటు జల దిగ్బంధంలో చిక్కిన సాలూర మండలంలోని మందర్నా, హున్సా, ఖాజాపూర్ గ్రామాల నుంచి వరద నీరు బయటకు వెళ్లిపోయింది. సాలూర-ఖాజాపూర్, ఖాజాపూర్-హున్సా గ్రామాల మధ్య రాకపోకలు మొదలయ్యాయి. హున్సా, మందర్నా గ్రామాల మధ్య వాగు వంతెన మీదుగా పారుతోంది. సాలూర మండలంలోని మందర్నా, హున్సా, ఖాజాపూర్, తగ్గేల్లి, సాలూర గ్రామాల శివార్లలో మంజీర నది, ఇతర వాగుల వరదతో సోయా, వరి, అరటి, బొప్పాయి, కూరగాయల పంటలు మునిగిపోయాయి. శనివారం వరద తగ్గడంతో స్వల్పంగా పంటలు తేలాయి. బోధన్ మండలంలోని హంగర్గ గ్రామంలో శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్ నిలకడగా ఉంది. హంగర్గ, కోపర్గ, బిక్నెల్లి, ఖండ్‌గామ్ గ్రామాల శివార్లలో సోయా, వరి పంటలు నీట మునిగాయి.

■ రెంజల్ మండలంలోని గోదావరి వరదతో కందకుర్తి, నీల, తాడ్‌బిలోలి, బోర్గం గ్రామాల శివార్లలో సోయా, వరి, పత్తి పంటలు నీటమునిగాయి. నవీపేట మండలంలోని గోదావరి పరీవాహక ప్రాంతాలైన యంచ, కోస్లీ, అల్జాపూర్, నాలేశ్వరం, తుంగిని, నందిగామ శివార్లలో పంటలు దెబ్బతిన్నాయి. పోతంగల్ మండలంలోని మంజీర తీరాన ఉన్న హెగ్డోలి, కల్లూరు, సుంకిని, హంగర్గ, కారేగాం, పోతంగల్ గ్రామాల శివారుల్లో సోయా, వరి పంటలు నీటమునిగాయి. ఇక సాలూర మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రం నుంచి ఖాజాపూర్, హున్సా గ్రామస్తులు తిరిగి ఇళ్లకు చేరుకున్నారు.



రైతు ఆరిఫ్‌బేగ్(ఎడమవైపు)

30 ఎకరాల్లో పంట నష్టం

రెంజల్(బోధన్): 30 ఎకరాల్లో సోయా పంటను సాగు చేశా. ఎకరానికి రూ. 20 వేల వరకు పెట్టుబడి పెట్టాను. వరదతో మూడు రోజులుగా సోయా పంట నీటిలోనే ఉంది. 24 గంటల్లో నీరు తేలితే పంటను మందులతో కాపాడుకోవచ్చు. ప్రస్తుతం పంట పూర్తిగా మురిగిపోతుంది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– ఆరిఫ్‌బేగ్, రైతు కందకుర్తి

■ ధర్పల్లి మండలంలోని హొన్నాజిపేట ముత్యాల చెరువు కట్ట తెగిపోవడంతో భారీ నష్టం వాటిల్లింది. ముత్యాలవాగు వరద ప్రవాహంతో దిగువన ఉన్న బీరప్పతండా, వాడి గ్రామస్తులు తీవ్రంగా నష్టపోయారు. పంట భూములు కోతకు గురయ్యాయి. ఇసుక మేటలు వేశాయి. వాడి గ్రామం ముంపునకు గురికావడంతో 20 కుటుంబాలు సర్వం కోల్పోయాయి. ఇళ్లలోకి వరద రావడంతో నిత్యావసరాలు, రిఫ్రిజిరేటర్లు, టీవీలు, ఇతర సామగ్రి పూర్తిగా బురదమయమై పనికిరాకుండా పోయాయి. శనివారం ఉదయం నుంచి వాడి గ్రామంలో వరద బాధితులు తమ ఇళ్లలోని బురదను శుభ్రపరుచుకునే పనిలో నిమగ్నమయ్యారు. విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో రెండు రోజుల అనంతరం శుక్రవారం సాయంత్రం ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ పునరుద్ధరణ చేశారు.

ఇళ్లు కోల్పోయి..

సిరికొండ మండలంలో కప్పలవాగు ఉప్పొంగడంతో కొండూరు గ్రామం అతలాకుతలమైంది. గ్రామంలోకి ఆకస్మికంగా వరద పోటెత్తడంతో గ్రామస్తులు కట్టుబట్టలతో ఊరి నుంచి బయటకు వచ్చి పునరావాస కేంద్రంలో తలదాచుకున్నారు. వరద ప్రవాహానికి గ్రామంలో 10 ఇళ్లు కూలిపోయాయి. 50 కుటుంబాలకు చెందిన ఆధార్, రేషన్ కార్డులు, వంట సామగ్రి, బియ్యం, బట్టలు, ఇతర నిత్యావసరాలు కొట్టుకుపోయాయి. 200 ఇళ్లల్లోకి భారీగా బురద చేరింది. గ్రామస్తులు గత రెండు రోజులుగా పేరుకుపోయిన బురదను శుభ్రం చేసుకుంటున్నారు.



సిరికొండ మండలం కొండూర్‌లో ఇళ్లు దెబ్బతినడంతో రోదిస్తున్న బాధితులు

పంటలను ముంచిన గోదావరి!

బాల్కొండ: శ్రీరాంసాగర్ జలాశయంలోకి వచ్చిన భారీ వరద దిగువన గోదావరి పరీవాహక ప్రాంత రైతుల పాలిట శాపంగా మారింది. గోదావరిలోకి 5.5 లక్షల క్యూసెక్కుల నీటిని వదలడంతో మెండోరా మండలం దూదిగాం, చాకీర్యాల్, కోడిచర్ల, సావెల్ గ్రామాల్లో సుమారు 400 ఎకరాల వరకు నీట మునిగింది. శుక్రవారం సాయంత్రం గోదావరిలోకి నీటి విడుదల పెంచగానే ఒక్కసారిగా ప్రవాహం పెరిగి దూదిగాంలో మొక్కజొన్న, సోయా, చాకీర్యాల్ వరి పంటల్లోకి నీరు చేరింది. పంటలు నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.



మెండోరా మండలం దూదిగాంలో గోదావరి నీటిలో మునిగిన పంటలు

పరీవాహక ప్రజలను అప్రమత్తం చేయాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- ఎస్సారెస్పీ సందర్శన

బాల్కొండ: గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టును శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో వివరాలను అడిగి తెలుసుకున్నారు. గోదావరిలోకి వదులుతున్న నీటిని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సారెస్పీలోకి మహారాష్ట్ర ప్రాంతంలోని గైక్వాడ్, విష్ణుపురి, బాలేగావ్‌లతోపాటు స్థానిక ఎగువ ప్రాంతాల్లోని నిజాంసాగర్, కౌలాస్‌నాలా, లెండి ప్రాజెక్టుల నుంచి భారీగా వరద వచ్చి చేరుతుందన్నారు. దీంతో బ్యాక్‌వాటర్ ఏరియాలతోపాటు దిగువన లోతట్టు ప్రాంతాల్లో ఎలాంటి ముంపు తలెత్తకుండా ప్రాజెక్ట్ అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 57 టీఎంసీల నీటిని ఉంచుతూ.. వరద గేట్లు, కాలువల ద్వారా 6 లక్షల క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా, ఎస్ఈ జగదీశ్, ఈఈ చక్రపాణి, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.



ఎస్సారెస్పీ అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

గంబూసియా చేపపిల్లలను పెంచాలి

దోమల నివారణ కోసం గంబూసియా చేపపిల్లలను అధికంగా పెంచాలని మత్స్యశాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. జాతీయ చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలో కావాల్సిన పనులు, ఉత్పత్తి చేసిన చేపపిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మత్స్యశాఖ ఏడీ ఆంజనేయులు, ఎఫ్‌డీవో దామోదర్ ఉన్నారు.

పెరిగిన పంట నష్టం

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంట నష్టం రోజురోజుకూ పెరుగుతోంది. శుక్రవారం వరకు 41,348 ఎకరాలున్న పంట నష్టం శనివారం నాటికి మరో 7,081 ఎకరాలు పెరిగి 48,429కి చేరింది. వరుణుడు శాంతించడంతో వరద ముంపునకు గురైన పొలాలు కొన్ని చోట్ల తేలుతున్నాయి. మరికొన్ని చోట్ల ముంపులోనే ఉన్నాయి. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం వివరాలను సేకరిస్తున్నారు. ఐతే, సేకరించిన పంటనష్టం లెక్కలు ప్రాథమిక అంచనా మాత్రమే. ఇందులో 33 శాతానికి మించి పంట నష్టపోయిన రైతులను గుర్తించి ప్రభుత్వానికి పంపనున్నారు. అంతకుముందే క్రాప్‌బుకింగ్ పోర్టల్‌లో పంటలను నమోదు చేయాల్సి ఉంటుంది.

పంట నష్టం జరిగిన మండలాలు	23
గ్రామాలు	185
పంట నష్టం (ఎకరాలు)	48,429
బాధిత రైతులు	24,778

ఆగస్టులో తేదీల వారీగా జరిగిన పంట నష్టం

తేదీ	రైతులు	ఎకరాలు
17,18,19	1,349	3,817
27,28	7,806	13,968
29	11,505	23,313
30	4,118	7,331
మొత్తం	24,778	48,429

కదిలిస్తే కన్నీళ్లే !

- భారీ వరదల ప్రభావం నుంచి కోలుకోని బాధితులు
- మూడు రోజుల తర్వాత జీఆర్ కాలనీ, హౌసింగ్‌బోర్డులకు విద్యుత్ సరఫరా

కామారెడ్డి టౌన్: మునుపెన్నడూ లేని విధంగా జిల్లాకేంద్రంలో ఒక్కసారిగా ముంచెత్తిన వరదలు.. పలు కాలనీల ప్రజలకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. నాలుగు రోజులు గడిచినా ఆనాటి వరద బీభత్సాన్ని మర్చిపోలేకపోతున్నారు. బాధితులను కదిలిస్తే కన్నీళ్లు సమాధానంగా వస్తున్నాయి. బుధవారం ఉదయం ఒక్కసారిగా వచ్చిన వరదలతో పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ, జీఆర్ కాలనీలు నీట మునిగిన విషయం తెలిసిందే. జీఆర్ కాలనీ, హౌసింగ్‌బోర్డు కౌండిన్య ఎన్‌క్లేవ్‌లలో 100కు పైగా ఇళ్లు వరద నీటిలో మునిగిపోయాయి. వరదతో కోలుకోలేని విధంగా దెబ్బతిన్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వదలని బురద

జీఆర్ కాలనీ, హౌసింగ్‌బోర్డులోని కౌండిన్య ఎన్‌క్లేవ్‌వాసుల కష్టాలు కంటిన్యూ అవుతున్నాయి. వరద తగ్గి మూడు రోజులవుతున్నా ఇంకా బురద కష్టాలు తీరడం లేదు. ఇళ్లలోకి చేరిన బురదను తొలగించడానికి అష్టకష్టాలు పడుతున్నారు. బురదతో తడిసి ముద్దయిన సామగ్రిని అంతా చెత్త కుప్పల్లో వేస్తున్నారు. వరదలో సుమారు 18 కార్లు కొట్టుకుపోయాయి. పాక్షికంగా పలు ఇండ్లు ధ్వంసం అయ్యాయి. ఈ రెండు కాలనీలవాసులు నాలుగు రోజులుగా సరైన తిండి లేక ఇబ్బందులు పడుతున్నారు. శనివారం స్వచ్ఛంద సంస్థలు భోజనాలు సమకూర్చాయి.

విద్యుత్ సరఫరా పునరుద్ధరించినా..

స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లకు మరమ్మతులు చేసి శనివారం మధ్యాహ్నం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఆదివారం వరకు ఎవరూ స్విచ్‌లను ఆన్ చేయవద్దని విద్యుత్ శాఖ అధికారులు సూచించారు.



కామారెడ్డి పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో సామగ్రిని శుభ్రం చేసుకుంటున్న బాధితులు

పక్కింటివాళ్లే ఆదుకున్నారు



ఇంట్లోకి ఒక్కసారిగా వరదనీరు వచ్చి చేరింది. దీంతో వెంటనే కుటుంబ సభ్యులం ఇంటిపైకి వెళ్లాం. వర్షంలో కొంత సమయం గడిపాం. పక్కంటి వాళ్ల కిటికిలోంచి వారింటిలోకి వెళ్లి వాళ్ల వద్ద క్షేమంగా ఉన్నాం. వాళ్లే మాకు తిండి పెట్టారు. విలువైన సర్టిఫికెట్లు, సామాన్లు అన్నీ తడిసిపోయాయి. – రమేశ్, జీఆర్ కాలనీవాసి

క్లుప్తంగా

సీఎంను కలిసిన రూరల్‌ ఎమ్మెల్యే

- వరద నష్టాన్ని వివరించిన భూపతిరెడ్డి



మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): హైదరాబాద్‌లో శనివారం జరిగిన శాసనసభ సమావేశం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డిని నిజామాబాద్‌ రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి కలిశారు. జిల్లాలో,రూరల్‌ నియోజకవర్గంలో జరిగిన వరద నష్టం గురించి ఆయన సీఎంకు వివరించారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి వరద నష్టం ఏ మేరకు జరిగిందో అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపించాలని కలెక్టర్‌కు సూచించామని భూపతిరెడ్డి అన్నారు.సీఎం సానుకూలంగా స్పందించి కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారని అన్నారు. రాష్ట్రంలో జరిగిన వరద నష్టంపై కలెక్టర్లతో సోమవారం సమీక్ష చేస్తానని సీఎం చెప్పినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

సెప్టెంబర్‌ 8 నుంచి ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం 4వ సెమిస్టర్‌ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ థియరీ పరీక్షలు సెప్టెంబర్‌ 8 నుంచి ప్రారంభం కానున్నట్లు కంట్రోలర్‌ సంపత్‌కుమార్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు సెప్టెంబర్‌ 17 వరకు కొనసాగుతాయన్నారు.

వాయిదా పడిన పరీక్షల రీషెడ్యూల్‌ విడుదల

తెయూ(డిచ్‌పల్లి): భారీ వర్షాల కారణంగా తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 28, 29, 30న జరగాల్సిన పీజీ, బీఈడీ, బీపీఎడ్‌ సెమిస్టర్‌ పరీక్షలను వర్సిటీ అధికారులు వాయిదా వేసిన సంగతి తెలిసిందే. వాయిదా పడిన ఈ పరీక్షల రీషెడ్యూల్‌ను శనివారం కంట్రోలర్‌ సంపత్‌కుమార్‌ విడుదల చేశారు. పీజీ సెమిస్టర్‌ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్షలు సెప్టెంబర్‌ 2, 3న జరుగుతాయని, బీఈడీ, బీపీఎడ్‌ సెమిస్టర్‌ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్షలు సెప్టెంబర్‌ 6, 8, 9 తేదీల్లో జరుగుతాయన్నారు. అలాగే ఎంఈడీ పరీక్షలు సెప్టెంబర్‌ 2న ప్రారంభమవుతాయన్నారు. పూర్తి వివరాల కోసం తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన సూచించారు.

ముంపులో ఉన్న గర్భిణికి వైద్యసేవలు



నవీపేట: గోదావరి వరదతో మండలంలోని మిట్టాపూర్‌ గ్రామం జల దిగ్బంధంలో ఉండిపోయింది. గ్రామంలోని 8 నెలల గర్భిణి స్వాతి శనివారం ఉదయం అనారోగ్యానికి గురవడంతో ఆస్పత్రికి తీసుకెళ్లలేని పరిస్థితి నెలకొంది. వారి దుస్థితిని వివరిస్తూ కొందరు యువకులు వీడియో తీసి సోషల్‌ మీడియాలో షేర్‌ చేయడంతో ఆరోగ్య సిబ్బంది స్పందించి బోటులో గ్రామానికి వచ్చారు. గర్భిణికి చికిత్స అందించి, ఆమెను అదే బోటులో మండల కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు.

మొరాయించిన బస్సు



బోధన్‌టౌన్‌: పట్టణంలోని అంబేడ్కర్‌ చౌరస్తాలో ఆర్టీసీ బస్సు మొరాయించింది. బోధన్‌ డిపోకు చెందిన బస్సు శనివారం బోధన్‌ నుంచి బాన్సువాడకు బయలుదేరింది. అంబేడ్కర్‌ చౌరస్తాలోని బస్‌స్టాప్‌ వద్ద బస్సు స్టార్ట్‌ కాకుండా కొద్దిసేపు మొరాయించింది. దీంతో ప్రయాణికులు బస్సు దిగి నెట్టడంతో స్టార్ట్‌ అయింది.



కొండూర్‌ గ్రామంలో కూలిన ఇల్లు వద్ద బాధితుడు భీమ్‌రావు..



పూర్తిగా ధ్వంసమైన ఇంటి అడుగు భాగం..



తడిసిపోయిన సామగ్రి, ఎలక్ట్రానిక్‌ పరికరాలు

మాటలకందని విషాదం

- వరదలతో ఇళ్లు దెబ్బతిని సర్వం కోల్పోయిన పలువురు
- కట్టుబట్టలే మిగిలిన వైనం



కూలిన ఇంట్లోంచి సామగ్రిని తీస్తున్న బాధితులు

సిరికొండ: మండలంలోని కొండూర్‌ గ్రామంలో వరద సృష్టించిన బీభత్సంతో మాటలకందని విషాదం నెలకొంది. వరద కారణంగా పది వరకు ఇళ్లు పూర్తిగా కూలిపోయాయి. మరో ఇరవై అయిదు ఇళ్లు శిథిలావస్థకు చేరాయి. 190 ఇళ్లలోని సామగ్రి, ఎలక్ట్రానిక్‌ పరికరాలు పూర్తిగా తడిచిపోయాయి. క్వింటాళ్ల కొద్ది బియ్యం తడిసిపోవడంతో వాగులో పడేసినట్లు గ్రామస్తులు తెలిపారు. వరద ఒక్కసారిగా రావడంతో వాగు సమీపంలో ఉన్న వారందరు కట్టుబట్టలతో సురక్షిత ప్రదేశానికి తరలి వెళ్లారు. బంగడి బాబయ్య అనే వ్యక్తి ఇల్లు అడుగు భాగం పూర్తిగా కొట్టుకుపోయింది. ఇంట్లోని సామగ్రి, విలువైన పత్రాలు సైతం వాగులో కొట్టుకుపోయాయని బాధితుడు వాపోయాడు. ఇళ్లలో బురద, చెత్త నిండిపోవడంతో గ్రామస్తులు శనివారం కూడా ఇళ్లను, సామగ్రిని శుభ్రం చేసుకుంటూనే ఉన్నారు. వరదతో ఇబ్బందులకు గురైన వారిని పరామర్శించేందుకు బంధువులు తరలివస్తుండగా, వారిని ఓదారుస్తు బంధువులు రోదించడం గ్రామస్తులను కలచివేస్తోంది.



కొండూర్‌లో వరద బాధితులకు ఆహారం అందజేస్తున్న యువకులు



కందకుర్తిలోని ఓ ఇంట్లోకి చేరిన నీటిని బకెట్లతో తొలగిస్తున్న కుటుంబీకులు

రెంజల్‌(బోధన్‌): 42 సంవత్సరాల తర్వాత గోదావరి నది పోటెత్తడంతో రెంజల్‌ మండలం కందకుర్తి గ్రామంలోని ఇందిరమ్మ కాలనీ పూర్తిగా నీట మునిగింది. వరద ఉధృతి పెరగడంతో శుక్రవారం రాత్రి నుంచి కాలనీవాసులు జాగారం చేయాల్సి వచ్చింది. అధికారులు పలువురిని పునరావాస కేంద్రాలకు బలవంతంగా తరలించారు. శనివారం పునరావాస కేంద్రాల నుంచి బాధితులు ఇళ్లకు చేరుకుని నీటిని తొలగిస్తున్నారు. ఇళ్ల ముందు నీరు వెళ్లే దారి లేకపోవడంతో మరికొందరు గ్రామంలోని బంధువుల ఇళ్లకు చేరుకున్నారు.

10 వేల కోళ్లు మృతి

దోమకొండ: మండలంలోని గొట్టుముక్కల గ్రామ శివారులో 10వేల కోళ్లు భారీ వర్షానికి మృతిచెందాయి. గ్రామానికి చెందిన గన్నమనేని పద్మకు ఎడ్లకట్ట వాగు సమీపంలో కోళ్లఫారాలు ఉన్నాయి. గత మూడు రోజులగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎడ్లకట్ట వాగు సమీపంలోని పంట పొలాల నుంచి నీరు ప్రవహించడంతో కోళ్లఫారాలు మునిగిపోయాయి. శనివారం వరద ఉధృతి తగ్గడంతో కోళ్లఫారాల యజమానులు అక్కడికి వెళ్లి చూడగా, అందులో ఉన్న పదివేల కోళ్లు బురదమట్టిలో కూరుకుపోయి చనిపోయి ఉన్నాయి. వెంటనే విషయాన్ని రెవెన్యూ, వెటర్నరీ అధికారులకు తెలియజేశారు. ఆర్‌ఐ శ్రీనివాస్‌, వెటర్నరీ డాక్టర్‌ శివ అక్కడికి చేరుకుని పంచమానా చేశారు. దాదాపు రూ. 6లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితురాలు పద్మ తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఆమె కోరారు.



దోమకొండ మండలం గొట్టిముక్కుల శివారులో వరదనీటిలో కూరుకుపోయి మృతిచెందిన కోళ్లు

నీరు తగ్గే అవకాశం లేదు..



వరద నీరు ఇంటి ముందు చెరువును తలపిస్తోంది. ఇంట్లోకి చేరడంతో నిత్యావసర వస్తువులు, బట్టలు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. తినేందుకు తిప్పలు పడాల్సి వస్తుంది. రాత్రి పునరావాస కేంద్రానికి తీసుకువెళ్లారు. శనివారం ఇంటికి చేరుకుని కుటుంబం మొత్తం నీటిని తొలగించేందుకు తంటాలు పడుతున్నాం. ఇంట్లోని నీటిని తొలగించినా ఇంటి ముందు చేరిన నీరు మరో రెండు రోజుల వరకు వెళ్లే పరిస్థితి లేదు. అప్పటి వరకు ఇంట్లోలోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

–అల్తాఫ్‌, కందకుర్తి

ఎన్‌డీఆర్‌ఎఫ్‌, ఎస్‌డీఆర్‌ఎఫ్‌ సేవలు భేష్‌

- వరద విపత్తులో సాహసోపేతమైన కృషిని కనబర్చాయి
- కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి



వాడిలో ఎస్‌డీఆర్‌ఎఫ్‌ బృందాలతో ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కలెక్టర్‌ వినయ్‌కృష్ణారెడ్డి (ఫైల్‌)

సుభాష్‌నగర్‌: భారీ వర్షాలతో వరద ప్రభావానికి లోనైన ప్రాంతాల్లో ఎన్‌డీఆర్‌ఎఫ్‌, ఎస్‌డీఆర్‌ఎఫ్‌ బృందాలు అందించిన సేవలు ప్రశంసనీయమని కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి అన్నారు. ఆయా బృందాలను శనివారం ఆయన అభినందించారు. జాతీయ, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళాలు కనబరచిన తెగువ, కృషి కారణంగా జిల్లాలో ఎక్కడ కూడా ప్రాణనష్టం వంటి సంఘటనలు చోటుచేసుకోకుండా నివారించామన్నారు. జల దిగ్బంధంలో చిక్కుకుపోయిన ఆయా గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో విపత్తు ప్రతిస్పందన దళాలు సాహసోపేతమైన కృషిని కనబర్చాయన్నారు. బోధన్‌ మండలం హంగర్గలో వరదల్లో చిక్కుకున్న సుమారు 480 మందిని ఎన్‌డీఆర్‌ఎఫ్‌ బృందాలు రెస్క్యూ చేశాయని అన్నారు. అదేవిధంగా రెంజల్‌ మండలం కందకుర్తి వద్ద సీతారాం త్యాగి మహారాజ్‌ ఆశ్రమంలో వరదలలో చిక్కుకున్న 8 మందిని విపత్తు సహాయక సభ్యులు ప్రాణాలకు తెగించి కాపాడారని, ఆశ్రమంలోని మూగ జీవాలకు కూడా అవసరమైన మేత, నీటి వసతిని సమకూర్చారని కలెక్టర్‌ వివరించారు. సాలూర మండలంలోని మందర్న, హున్సా, ఖాజాపూర్‌ గ్రామాల్లో జలదిగ్బంధంలో చిక్కుకున్న 120 మందిని బోట్ల ద్వారా ఎస్‌డీఆర్‌ఎఫ్‌, 7వ పోలీస్‌ బెటాలియన్‌ బృందాలు రక్షించాయని తెలిపారు. ముత్యాల చెరువు తెగడంతో ధర్పల్లి మండలం వాడి గ్రామాన్ని వరద నీరు చుట్టుముట్టగా, ఎస్‌డీఆర్‌ఎఫ్‌ బృందం హుటాహుటిన చేరుకొని సహాయక చర్యలు కొనసాగించిందని తెలిపారు. ఇదే రీతిలో జిల్లాలోని వివిధ ప్రాంతాలలో వరదలలో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు చేరవేసేందుకు ఎన్‌డీఆర్‌ఎఫ్‌, ఎస్‌డీఆర్‌ఎఫ్‌ బృందాలు కృషిచేశాయని తెలిపారు.

గోసేవలో ఎస్‌డీఆర్‌ఎఫ్‌ బృందాలు..



రెంజల్‌(బోధన్‌): మండలంలోని కందకుర్తి పుష్కరక్షేత్రంలోగల సీతారాం మహరాజ్‌ త్యాగి ఆశ్రమానికి శనివారం స్థానికులతో కలిసి ఎస్‌డీఆర్‌ఎఫ్‌ బృందం చేరుకుంది. ఆశ్రమం చుట్టూ వరద నీరు చేరడంతో మూడు రోజుల కిందట ఆశ్రమంలోని మహారాజ్‌ శిష్యులు, భక్తులను ఎస్‌డీఆర్‌ఎఫ్‌ బృందాలు వారిని సురక్షితంగా గ్రామానికి తరలించారు. ఆశ్రమంలోని 20 గోవులను మేడపైకి చేర్చారు. మూడు రోజులుగా ఆశ్రమంలోని గోవులకు తాగునీరు, మేత లేకపోవడంతో భక్తులతో కలిసి ఎస్‌డీఆర్‌ఎఫ్‌ బృందాలు మేత, తాగు నీరు అందించింది.

కోలుకుంటున్న మంజీర తీర గ్రామాలు



పెద్ద వాగులో వరద ఉధృతి తగ్గడంతో ఖాజాపూర్‌-హున్సా గ్రామాల మధ్య ప్రారంభమైన రాకపోకలు



సాలూరలోని పునరావాస కేంద్రం నుంచి స్వగ్రామానికి వెళ్తున్న హున్సా గ్రామస్తులు

బోధన్‌: భారీ వర్షాలు, మంజీర నది, వాగులకు పోటెత్తిన వరద కారణంగా సాలూర మండలంలోని మందర్నా, హున్సా, ఖాజాపూర్‌ గ్రామాలు మూడు రోజులు జలదిగ్బంధంలో చిక్కాయి. శనివారం మంజీర నదికి వరద తగ్గుముఖం పట్టడంతో తిరిగి ప్రజలు స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. సాలూర-ఖాజాపూర్‌, హున్సా-ఖాజాపూర్‌ గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు సైతం పునఃప్రారంభమయ్యాయి. హున్సా-మందర్నా గ్రామాల మధ్యగల లోలెవల్‌ వంతెన మీదుగా వరద నీరు పారడంతో ట్రాక్టర్లపై గ్రామస్తులు రాకపోకలు సాగిస్తున్నారు.

రెండు రోజులుగా వరదలోనే పంటలు



ఖాజాపూర్‌ శివారులో నీట మునిగిన సోయా



హున్సా శివారులో నీట మునిగిన ఆకు కూరలు, కూరగాయల తోటలు

బోధన్‌: మంజీర నది పరీవాహక ప్రాంత రైతులను భారీ వర్షం, వరదలు అపార నష్టాలపాలు చేశాయి. రైతుల కష్టం, పెట్టిన పెట్టుబడి నీట మునిగాయి. సాలూర మండలంలోని మందర్నా, హున్సా, ఖాజాపూర్‌, సాలూర, తగ్గేల్లి గ్రామాల శివారులో వేలాది ఎకరాల సోయా, వరి, అరటి, బొప్పాయి, కూరగాయాలు, ఆకుకూరలు రెండు రోజులుగా వరద నీటిలోనే ఉన్నా యి. శనివారం మంజీర నది, వాగులకు వరద తగ్గుముఖం పట్టడంతో స్వల్ప విస్తీర్ణంలోని పంటలు తేలాయి. నీట మునిగిన పొలాలను చూసి రైతులు లబోదిబోమంటున్నారు. ఆదివారం సాయంత్రం వరకు వరద నీరు తగ్గే అవకాశాలున్నాయి. వ్యవసాయ శాఖ అధికారుల ప్రాథమిక అంచనాల కన్నా ఎక్కువ విస్తీర్ణంలో పంటలు దెబ్బ తిన్నట్లు పరిస్థితులు కనిపిస్తున్నాయి.

దెబ్బతిన్న పంటల పరిశీలన

సాలూర మండలంలోని తగ్గెల్లి గ్రామ శివారులో వరద కారణంగా నీటమునిగిన వరి, సోయా పంటలను బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు వడ్డీ మోహన్‌రెడ్డి, మండల నాయకులతో కలిసి పర్యటించి పరిశీలించారు. ప్రభుత్వం సర్వే చేసి రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. మందర్నా గ్రామంలో దెబ్బతిన్న పంటలు, రోడ్లను కాంగ్రెస్‌ శ్రేణులు, అధికారులు పర్యటించి పరిశీలించారు. సాలూర పీహెచ్‌సీ, హున్సా హెల్త్‌ సబ్‌ సెంటర్‌ వైద్య సిబ్బంది గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు.



హున్సాశివారులో దెబ్బతిన్న సోయా పంటను చూపుతున్న రైతులు



మందర్నా గ్రామంలో దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న కాంగ్రెస్‌ నాయకులు



తగ్గేల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు వడ్డీ మోహన్‌ రెడ్డి, నేతలు

హంగర్గలో తగ్గుతున్న నీటి ఉధృతి



హంగర్గలో పరిస్థితులను పరిశీలిస్తున్న అడిషనల్‌ కలెక్టర్‌ అంకిత్‌, ట్రెయినీ ఐఏఎస్‌ చింగ్తియాన్‌ మావీ

బోధన్‌రూరల్‌: మండలంలోని హంగర్గ గ్రామంలో శ్రీరాంసాగర్‌ బ్యాక్‌వాటర్‌ నీటి ఉధృతి తగ్గుముఖం పట్టింది. శ్రీరాంసాగర్‌ బ్యాక్‌ వాటర్‌, మంజీర నదిలో వరద ప్రవాహం ఎక్కువవడంతో రెండు రోజులపాటు హంగర్గ గ్రామం జల దిగ్బంధంలో చిక్కుకుంది. ప్రాజెక్టు గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండటంతో శనివారం సాయంత్రానికి గ్రామంలో ముంపు ప్రభావం తగ్గింది. ఇటీవల ఎన్‌డీఆర్‌ఎఫ్‌ సిబ్బంది సహాయంతో గ్రామంలోని ముంపు ప్రాంతం నుంచి 376 మంది గ్రామస్తులను, 30కుపైగా సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు తహసీల్దార్‌ విఠల్‌ తెలిపారు. వర్షం కురవకపోతే ఆదివారం సాయంత్రానికి గ్రామంలో ముంపు ప్రభావం పూర్తిగా తగ్గే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

3వేల ఎకరాల్లో నీటమునిగిన పంటలు

శ్రీరాంసాగర్‌ బ్యాక్‌వాటర్‌, మంజీర నది ఉధృతితో హంగర్గతోపాటు ఖండ్‌గావ్‌, బికినెల్లీ, సిద్ధాపూర్‌, కల్దుర్కి శివారులోకి భారీగా వరదనీరు చేరడంతో పంటలు నీట మునిగాయి. మంజీర తీర గ్రామాల్లో సుమారు 3వేల ఎకరాల్లో పంటలు నీట మునిగినట్లు వ్యవసాయ అధికారులు అంచనవేశారు. అత్యధికంగా సోయా పంట దెబ్బతింది.

అడిషనల్‌ కలెక్టర్‌ పర్యటన..

హంగర్గ గ్రామంలో అడిషనల్‌ కలెక్టర్‌ అంకిత్‌ కుమార్‌ శనివారం స్థానిక అధికారులతో కలిసి పర్యటించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్‌ సిబ్బందితో పడవలో ప్రయాణించి గ్రామంలో పరిస్థితులను సమీక్షించారు. టెయినీ ఐఏఎస్‌ చింగ్తియాన్‌ మావీ, బోధన్‌ తహసీల్దార్‌ విఠల్‌ తదితరులు ఉన్నారు.

షార్ట్‌ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం



సిరికొండ: మండలంలోని ముషీర్‌నగర్‌ గ్రామంలో ఉప్పారం మల్లయ్య ఇంట్లో షార్ట్‌ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించినట్లు తహసీల్దార్‌ రవీందర్‌రావు శనివారం తెలిపారు. ప్రమాదంలో ఇంట్లో ఉన్న రూ. లక్ష అరవై వేల నగదు, ఐదు సెల్‌ఫోన్లు, నిత్యావసర సరుకులు, దుస్తులు, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయినట్లు తెలిపారు. ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు తెలిపారు. ప్రమాదస్థలాన్ని ఎమ్మార్వై గంగరాజం సందర్శించి పంచనామా నిర్వహించారు. ప్రమాదంలో నాలుగు లక్షల పది వేల రూపాయల ఆస్తి నష్టం జరిగిందని తహసీల్దార్‌ తెలిపారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

బాన్సువాడ: బీర్కూర్‌లోని కాలబజార్‌ గల్లీలో పేకాడుతున్న ఆరుగురిని అరెస్ట్‌ చేసినట్లు ఎస్సై రాజశేఖర్‌ శనివారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు గల్లీలోని పేకాట స్థావరంపై దాడి చేసి, వారిని పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3080 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

క్రైం కార్నర్‌

గుండెపోటుతో ట్రాక్టర్‌ డ్రైవర్‌ మృతి



రమేష్‌(ఫైల్‌)

బీబీపేట: బీబీపేట పెద్ద చెరువుకు పడ్డ బుంగను పూడ్చడానికి ట్రాక్టర్‌పై బయలుదేరిన డ్రైవర్‌ గుండెపోటుతో మృతి చెందిన ఘటన ఉప్పర్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రభాకర్‌ తెలిపిన వివరాలు ఇలా.. బీబీపేట పెద్ద చెరువు కట్టకు బుంగ పడడంతో ఉప్పర్‌పల్లి గ్రామానికి చెందిన మన్నె రమేష్‌ తన ట్రాక్టర్‌ ద్వారా మట్టిని గత మూడు రోజులుగా తీసుకెళ్తున్నాడు. శనివారం మట్టిని తరలించే క్రమంలో అకస్మాత్తుగా గుండెలో నొప్పి రావడంతో స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అతడు మృతి చెందినట్లుగా తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య మణెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

ఇందల్వాయి: ఇటీవల విద్యుత్‌ షాక్‌తో తీవ్రంగా గాయపడిన జీపీ కార్మికుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై సందీప్‌ తెలిపిన వివరాలు ఇలా.. ఇందల్వాయి తండాకు చెందిన జీపీ కార్మికుడు ఎడపల్లి చిన్న సాయిలు(41) వారం రోజుల క్రితం విద్యుత్‌ వీధి దీపాలను అమర్చుతుండగా కరెంట్‌ షాక్‌కు గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు చికిత్స నిమిత్తం ఓ ప్రయివేట్‌ ఆస్పత్రికి తరలించారు. అక్క చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. సాయిలు మృతికి పంచాయతీ కార్యదర్శి, కారోబార్‌ కారణమని పలువురు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్‌ షాక్‌తో గేదె..



బీబీపేట: మండలంలోని యాడారం గ్రామంలో కాటేం శ్రీనివాస్‌కు చెందిన గేదె శనివారం సమీపంలోని పొలాల్లో విద్యుత్‌ షాక్‌తో మృతి చెందింది. ఘటన స్థలాన్ని పశు వైద్యాధికారి శివకుమార్‌, విద్యుత్‌ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. గేదె విలువ రూ. లక్ష వరకు ఉంటుందని, ప్రభుత్వం తమకు నష్టపరిహారం అందించాలని బాధితుడు కోరాడు.

అత్తింటి వేధింపులతో వివాహిత ఆత్మహత్య


ఇందల్వాయి: పిల్లలు కావట్లేదని, అదనపు కట్నం తేవాలని అత్తింటి వారు వేధింపులకు గురిచేయడంతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై సందీప్‌ తెలిపిన వివరాలు ఇలా.. ధర్పల్లి మండలం కొరట్‌పల్లి గ్రామానికి చెందిన హేమలత అలియాస్‌ సంధ్య(32)తో నల్లవెల్లి గ్రామానికి చెందిన నీరడి గంగాధర్‌కు పదకొండేళ్ల క్రితం వివాహం జరిగింది. అప్పటి నుంచి హేమలతను అదనపు కట్నం కోసం, పిల్లలు కావట్లేదని గంగాధర్‌ అతడి తల్లి ఎల్లవ్వ శారీరకంగా మానసికంగా వేధించేవారు. గంగాధర్‌ తన ప్రవర్తనను మార్చుకోవాలని పెద్దలు సూచించినా అతడు మారలేదు. ఈ క్రమంలో శుక్రవారం అతడు వేధింపులకు గురిచేయడంతో జీవితంపై విరక్తి చెందిన హేమలత గౌరారం వాగులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బస్సు నుంచి పడి మహిళకు గాయాలు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ముస్తాపూర్‌ గ్రామం వద్ద శనివారం ఆర్టీసీ బస్సులోనుంచి ఓ మహిళ పడడంతో గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. లింగంపేటకు చెందిన కొట్టూరి చంద్రకళ శనివారం కామారెడ్డికి బస్సులో బయలు దేరింది. ముస్తాపూర్‌ గ్రామం వద్ద ఆమె బస్సులోనుంచి ప్రమాదవశాత్తు జారిపడిపోయింది. ఈ ఘటనలో ఆమెకు గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి ఆమెను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఎస్సారెస్పీకి మళ్లీ పోటెత్తిన వరద

- ఇన్‌ఫ్లో 5.4 లక్షల క్యూసెక్కులు రావడం ఈ ఏడాదిలో తొలిసారి
- కొనసాగుతున్న నీటి విడుదల



వరద గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద కొనసాగుతుండటంతో ప్రాజెక్టు అధికారులు వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటిని విడుదల చేస్తున్నారు. శుక్రవారం రాత్రికి ప్రాజెక్ట్‌లోకి 5లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో పెరగడంతో గోదావరిలోకి నీటి విడుదలను 5.75 లక్షల క్యూసెక్కులకు పెంచారు. శనివారం మధ్యాహ్నం వరకు అంతే స్థాయిలో నీటి విడుదల కొనసాగింది. రాత్రికి వరద నీరు మళ్లీ పోటెత్తింది. రాత్రి 8 గంటలకు 5 లక్షల 10వేల క్యూసెక్కులకు పెరుగగా, రాత్రి 9 గంటలకు ఏకంగా 5.4లక్షలకు పెరిగింది. ప్రస్తుత సంవత్సరం గరిష్ఠంగా 5.4 లక్షల క్యూసెక్కుల నీరు రావడం ఇదే తొలిసారి. కానీ గోదావరిలోకి నీటి విడుదలను ప్రాజెక్ట్‌ అధికారులు తగ్గించారు. 38 వరద గేట్ల ద్వారా 4.5 లక్షల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్ట్‌ నీటి మట్టం పెంచుట కోసం నీటి విడుదలను తగ్గించారు. వరద మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

165 టీఎంసీలు గంగపాలు..

ప్రాజెక్ట్‌ నుంచి గోదావరిలోకి ఈ నెల 18 నుంచి నీటి విడుదల చేపట్టారు. శనివారం సాయంత్రం వరకు 165 టీఎంసీల నీటిని వదిలినట్లు ప్రాజెక్ట్‌ అధికారుల రికార్డులు తెలుపుతున్నాయి. గడిచిన మూడు రోజుల వ్యవధిలోనే 110 టీఎంసీల నీటిని వదిలారు. ఇప్పటికీ ప్రాజెక్ట్‌లోకి వరద నీరు కొనసాగుతుంది. అలాగే ప్రాజెక్ట్‌ నుంచి వరద కాలువ ద్వారా నీటి విడుదలను 12 వేల క్యూసెక్కుల నుంచి 16 వేల క్యూసెక్కులకు పెంచారు. కాకతీయ కాలువ ద్వారా 3వేల క్యూసెక్కులు, ఎస్కేప్‌ గేట్ల ద్వారా 5వేల క్యూసెక్కులు, మిషన్‌ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 636 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) కాగా శనివారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1084.40(58.04 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్‌ అధికారులు పేర్కొన్నారు.

ఇంటికి వెళ్లడానికి డబ్బులు లేవంటూ రూ.8 లక్షలు చోరీ

మాక్లూర్‌: తనకు చాలా ఆకలిగా ఉందని, ఇంటికి వెళ్లడానికి డబ్బులు లేవంటూ ఓ వ్యక్తి పోస్టుమాస్టర్‌ను నమ్మించి, అతడి ఇంట్లోని రూ.8లక్షలను చోరీ చేసిన ఘటన మండలంలోని అడవిమామిడిపల్లిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. మండలంలోని అడవి మామిడిపల్లికి చెందిన నరేంధర్‌ పోస్టుమాస్టర్‌గా పనిచేస్తాడు. కాగా పింఛన్ల పంపిణీకి సంబంధించిన డబ్బులను తీసుకురావడానికి శుక్రవారం అతడు నిజామాబాద్‌లోని ఓ బ్యాంకుకు వెళ్లాడు. బ్యాంకు నుంచి రూ: 8లక్షలను డ్రా చేసుకుని ఇంటికి వచ్చాడు. ఓ గుర్తుతెలియని వ్యక్తి నరేంధర్‌ వద్దకు వచ్చి తనకు చాలా ఆకలిగా ఉందని, కనీసం ఇంటికి వెళ్లడానికి డబ్బులు లేవని నమ్మించి రాత్రి అతడి ఇంటి వద్దే భోజనం చేసి అక్కడే నిద్రించాడు. శనివారం తెల్లవారుజామున నరేంధర్‌ చూసేసరికి సదరు వ్యక్తి కనిపించలేదు. ఇంట్లో దాచిన రూ: 8 లక్షలు కూడ లేకపోవటంతో చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే అతడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై రాజశేఖర్‌ తెలిపారు.